# ప్రజాశక్తి

శనివారం 21 సెప్టెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

### బడి పిల్లలకు

## పౌష్టికాహారం ఇవ్వాలి..

**కలెక్టర్ వెంకటమురళి**

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

బడి పిల్లలకు పిండి పదార్థాలు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్‌తో కూడిన మంచి భోజనం పెట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులతో శుక్రవారం వర్చువల్ గూగుల్ మీట్‌ని కలెక్టర్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడిలోనే భోజనం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆయన తెలిపారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాలలను అధికారులు సందర్శించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతుందా.? లేదా.? చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అభిప్రాయాలు, సూచనలను స్వీకరిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభిప్రాయాలను తెలియపరచాలన్నారు. మండలాల నుండి వచ్చే సూచనల మేరకు మార్పులు చేయడానికి ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, విద్యాశాఖ ఏఎస్ఓ సంజయ్ కుమార్, మండలాలలో నుంచి ఎంఈవోలు పాల్గొన్నారు.



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



సిఎం చంద్రబాబుకు వృద్ధురాలి ఆత్మీయ పలకరింపు

### అక్టోబర్‌లో..

# బోగస్ పింఛన్ల వెరిఫికేషన్

- ట్రాక్టర్, ఎడ్ల బండితో ఇసుకను ఎవరైనా తీసుకెళ్లొచ్చు..
- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, నాగులుప్పలపాడు**

ఇసుకను గ్రామాల్లో ట్రాక్టర్ లేదా ఎడ్లబండితో ఎవరైనా తీసుకుపోవచ్చని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రంలో పాలనను గాడిలో పెడతానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చాలా మందికి అనర్హులుగా ఉన్నా పెన్షన్లు ఇచ్చారన్నారు. అక్టోబరులో గ్రామసభలు పెట్టి వెరిఫికేషన్ చేయిస్తామన్నారు. అర్హులందరికీ వచ్చేలా చూస్తామన్నారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడులో శుక్రవారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలన ఎలా ఉందో తెలుసుకోవడానికే వచ్చామన్నారు. గ్రామంలో మూడు ఇళ్లను వెళ్లి అన్నీ పరిశీలించామన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా రూ.4 వేలు పెన్షన్ ఇస్తున్నామన్నారు. తాను ఇళ్లకు వెళ్లి చూసినప్పుడు పరిస్థితుల కారణంగా పిల్లలను చదివించలేక పనులకు పంపుతున్నారని తెలిసిందన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మళ్లీ కాలేజీల్లో చేర్చడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఇస్తామన్నారు. తాను ఆర్భాటాలకు పోవడం లేదన్నారు. తాను అనుకుంటే లక్షమందితో మీటింగులు పెట్టుకోవచ్చన్నారు. 45 ఏళ్ల ▶ 2లో



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు



జిల్లా నూతన అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు ఇతర జిల్లా నేతలతో వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

# వైసిపి జిల్లా అధ్యక్షుడిగా 'బూచేపల్లి'

- జిల్లా నేతల భేటీలో ఖరారు చేసిన అధినేత జగన్
- బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా కరణం వెంకటేష్.?

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

వైసిపి జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఖరారయ్యారు. శుక్రవారం నాడు తాడేపల్లిలో జిల్లా వైసిపి నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఈ భేటీలోనే బూచేపల్లిని జిల్లా అధ్యక్షుడుగా పెట్టాలని నిర్ణయించారు. జిల్లా నేతలు అందరూ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయన పేరునే ప్రతిపాదించారు. సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు కుందుర్రు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇక బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా యువనేత కరణం వెంకటేష్ పేరు ప్రతిపాదనలోకి వచ్చింది. ఆయనే దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. వెంకటేష్ కూడా శుక్రవారం నాడు జగన్‌ను కలిశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఇక మాజీ మంత్రి బాలినేని పార్టీకి రాజీనామా చేశాక జిల్లాలో పార్టీని కాపాడుకునేందుకు జగన్ వెంటనే దృష్టి సారించారు. పార్టీని వీడిపోయే వారిపై ఆరా తీశారు. నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం, ఆయనతో సన్నిహితంగా ఉండే నేతల పరిస్థితిపైనా చర్చ సాగింది. ఏదేమైనా బూచేపల్లి నాయకత్వంలో కలిసికట్టుగా పని చేయాలని జగన్ జిల్లా నేతలకు సూచించారు. రాబోయేది మన ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, వాటిని ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

## మానవత్వం చాటుకున్న ఎస్‌పి

**మూర్ఛ రోగికి ప్రథమ చికిత్స అందించి కాపాడిన దామోదర్**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయం చేసి ఎస్‌పి దామోదర్ మానవత్వాన్ని చాటుకున్నారు. మూర్ఛ వ్యాధి వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేయించి కాపాడారు. నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి మద్దిరాలపాడుకు జిల్లా ఎస్పీ వెళుతున్నారు. మార్గ మధ్యలో ఒంగోలు వుడ్ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై నెల్లూరు జిల్లా, జలదంకి మండలానికి చెందిన బ్రహ్మయ్య(35) తన ఊరు నుండి విజయ వాడలో ఉన్న తన అక్క వద్దకు వెళ్లడానికి రాత్రి బయలుదేరి ఒంగోలులో దిగారు. ఒంగోలు నుండి విజయవాడకు వెళ్ళడానికి రోడ్డుపై నిలబడి ఉండగా మూర్ఛ వచ్చి పడిపోయాడు. అటుగా వెళుతున్న జిల్లా ఎస్పీ ఆ వ్యక్తిని గమనించి తక్షణమే స్పందించి తన వాహనాన్ని నిలిపివేశారు. అతని వద్దకు వెళ్లి పరిస్థితి గమనించి, చేతిలో తాళాలు పెట్టించి, ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చిన తర్వాత మంచినీళ్లు స్వయంగా అందజేసి అతడిని పరామర్శించారు. మూర్ఛ వ్యాధి కారణంగా ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వ్యక్తిని గమనించి అతని ప్రాణాలను నిలబెట్టడంలో చూపిన చొరవకు ఆ వ్యక్తి కన్నీటి పర్యంతమై ఎస్పీకి, ఇతర పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ చూపిన చొరవకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ వెంట ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.



మూర్ఛ రోగిని కాపాడుతున్న ఎస్‌పి, సిబ్బంది

## అక్టోబర్‌లో బోగస్ పింఛన్ల వెరిఫికేషన్

**(మొదటిపేజీ తరువాయి)**

రాజకీయ చరిత్రలో నాలుగుసార్లు ముఖ్యమంత్రిని అయ్యానన్నారు. మిమ్మల్ని చూడటానికే వచ్చానన్నారు. పాలనను గాడిలో పెట్టడానికి మళ్లీ తనకు అవకాశం ఇచ్చారన్నారు. 93 శాతం సీట్లు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని, ఆక్సిజన్ తీస్తే ప్రాణం పోయేలా తయారైందన్నారు. 21 మంది ఎంపీలను ఇచ్చినందున ఢిల్లీ నుంచి ఆక్సిజన్ తెచ్చుకునే అవకాశం వచ్చిందన్నారు. అన్ని రంగాలను, వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు. మద్దిరాలపాడులో జనాభా తగ్గడాన్ని ప్రస్తావిస్తూ గతంలో సంతానం అదుపులో ఉంచుకోవాలని చెప్పానని.. ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంటు సరిగా ఉండాలన్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గుతుందని, రానున్న కాలంలో ముసలోళ్లు పెరిగి యువకులు లేకుండా పోయే పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటినుంచే పాపులేషన్ మేనేజ్‌మెంటు సరిగా చూసుకోవాలని సర్పంచికి సూచిస్తున్నామని చెప్పారు. రూ.99కే క్వార్టర్ మద్యం ఇచ్చే పాలసీని ప్రవేశపెట్టామన్నారు. దీపావళి నుంచే మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తామన్నారు. సభకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. వేదికపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా వీరాంజనేయస్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కృష్ణప్రసాద్, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, గ్రామ సర్పంచి స్వర్ణ అనురాధ పాల్గొన్నారు.

# గాలొస్తే.. గడగడే..

- శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు
- కూలేందు సిద్ధంగా ఉన్న వైనం
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

ఆ విద్యుత్ స్తంభం పూర్తి శిథిలమైంది. లోపల ఉన్న ఇసుక సువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా... సబంధిత అధికారులు స్పందించడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పెద్ద గాలి వచ్చినప్పుడల్లా గడ గడ లాడుతున్నారు. అధికారులు ప్రతిరోజూ అటు చూస్తూ పోతుఉంటారే తప్ప సమస్యను పరిష్కరిద్దామన్నా ఆలోచన చేయడం లేదు. ఇది శింగరాయకొండ విద్యుత్ శాఖ అధికారుల పనితీరు.

శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని నరసింహశెట్టి ఆడితి వీధిలోనున్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. అది సిమెంటు స్తంభం కావడంతో స్తంభం లోపల ఉన్న ఇనప సువ్వలు సైత బయటకు కనిపిస్తున్నాయి. పెద్ద గాలులు వీస్తే కూలేందుకు సిద్ధంగా ఉంది. సమస్య గురించి స్థానికులు అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు పట్టించుకున్న దాఖాలాలు లేవు. ఆ స్తంభం ఏ క్షణాన కూలుతుందేమోనని ఆ ప్రాంత వ్యాపారులు, ప్రజలు భయంతో కాలం గడుపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసే కంటే ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



ఇనుప సువ్వలు బయట పడిన స్తంభం



అడుగు భాగంలో దెబ్బతిన్న స్తంభం

శింగరాయకొండ గ్రామపంచాయతీలోని శిఖాకొల్లు వారి వీధిలోనూ మరో స్తంభం శిథిలావస్థకు చేరింది. ఇది ఇనుప స్తంభం. అడుగుభాగాన పూర్తిగా దెబ్బతింది. విద్యుత్ వైర్ల ఆధారంగా ఇది నిలిచి ఉంది. ప్రమాద భరితంగా మారిన ఈ స్తంభాన్ని మార్చాలని ఆ ప్రాంత ప్రజలు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వీధులోనే రాకపోకలు సాగిస్తుంటారు. స్కూల్ బస్సులు, ఇతర వాహనాలతో ఈ వీధి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ స్తంభం గాలులు వీస్తే పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే శిథిలావస్థకు చేరిన స్తంభాన్ని తొలగించి నూతన స్థంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.





# ఆగ్రహారం కాలువలో పూడికతీత

**ప్రజాశక్తి-చీమకుర్తి**



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ప్రతినిధులు

అగ్రహారం మేజరు సాగర్ కాలువలో కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టక పోవడం నీటి పారుదల నిలిచి పోయింది. ఈ కాలువ పరిధిలో మంచికలపాడు, అగ్రహారం పరిధిలో మాగాణులు,ఆరుతడి పంటల భూములు ఉన్నాయి. దాదాపు 3 కిలోమీటర్ల పొడవునా కాలువలో పూడికతీత పనులు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో కాలువ క్రింద ఆయకట్టు రైతులు ఇటీవల కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా హనుమంతరావు లను కలిసి పూడికతీత పనులు చేయించాలని విన్నవించుకున్నారు. స్పందించిన కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం తమ సొంత నిధులతో శుక్రవారం నుంచి పూడికతీత పనులు ప్రారంభించారు. స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో చీమకుర్తి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షులు,టిడిపి సీనియర్ నేత కాట్రగడ్డ రమణయ్య, కంపెనీ జనరల్ మేనేజర్ టివి. మురళీ మోహనరావు, ప్రతినిధులు శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, కిషోర్, ఆంజనేయులతో కలిసి పూడిక తీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రహారం మేజర్ కాలువ పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేయిస్తున్నట్లు తెలిపారు. కాలువ పరిధిలోని రైతులు మాట్లాడుతూ తమ కాలువకు గత రెండేళ్లు నీటివ పారుదల లేక కాలువ పూడిపోయి అల్లాడుతున్నట్లు తెలిపారు. కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేతలు శిద్దా వెంకటేశ్వరరావు,శిద్దా హనుమంతరావు చొరవతో కాలువ బాగుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-చీమకుర్తి**



ఆర్థిక సాయం అందజేస్తున్న మద్దాళి

అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళి మాధవరావు పేద విద్యార్థిని రమ్యకు శుక్రవారం రూ.2వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. తొలుత మద్దాళి పుట్టినరోజు సందర్భంగా జెవైసి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం రమ్యకు రూ.2 వేల నగదు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా నాయకులు ఆలూరి చిరంజీవి, చంద్రశేఖర్, డేవిడ్, ప్రభాకర్,జెవైసి నాయకులు ఆలూరి వెంకటరావు, చిన్న, కిషోర్,నాని పాల్గొన్నారు.

# ఆరేళ్లుగా ఎదురుచూపులే..!

- అందని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- ఆందోళనలో లబ్ధిదారులు
- డిపాజిట్ నగదూ తిరిగివ్వని వైనం
- పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు



మార్కాపురంలోని మున్సిపల్ కార్యాలయం

**ప్రజాశక్తి-మార్కాపురం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో మధ్య తరగతి ప్రజలకు సొంత గూడు కల్పించాలన్న ఉద్దేశ్యంతో గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం- ఎన్టీఆర్ గృహకల్ప పథకం తీసుకురావడం జరిగింది. ఈ పథకం ద్వారా డబుల్ బెడ్‌రూమ్ గృహాలను నిర్మిస్తామని అప్పట్లో ప్రకటించింది. ఈ పథకం ప్రారంభమై ఆరేళ్లు దాటినా ఒక్క లబ్ధిదారుడికీ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించలేదు. లబ్ధిదారుడి వాటాగా చెల్లించిన రూ. 25 వేలకూ దిక్కులేకుండా పోయింది.

మార్కాపురం మున్సిపాలిటీలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం-ఎన్టీఆర్ గృహకల్ప పథకం ద్వారా 2018లో 240 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, ఇంటికి సరిపడే విధంగా స్థలం కేటాయించాల్సి ఉంది. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారుడు రూ. 25 వేలు మొదటి విడతగా చెల్లించాలి. ఆ తరువాత ఎంపిక చేసిన స్థలంలో గృహాల నిర్మాణం చేపట్టాలి. గృహ నిర్మాణ పనులు ప్రారంభించిన తరువాత ఏదైనా బ్యాంకు నుండి రుణం ఇప్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇందులో ప్రభుత్వం కొంత సబ్సిడీ కూడా అందిస్తుందని ప్రకటించారు. మధ్య తరగతి సొంతగూడు లేని ప్రజలు ఈ పథకం వైపు ఆకర్షితులయ్యారు. మార్కాపురం మున్సిపాలిటీలో 240 మంది అప్పట్లో రూ. 25వేల చొప్పున మార్కాపురం మున్సిపాలిటీ పేరుతో బ్యాంకు డిడిలు తీసి కమిషనర్‌కు అందించారు. ఈ విధంగా రూ. 25 వేలు చెల్లించిన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు దక్కినట్లేనని అప్పట్లో పాలకులు ఊరించారు. కాలం గడిచిపోతోంది కానీ... డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇంతలో 2019లో ఎన్నికలు రానే వచ్చాయి. టిడిపి అధికారంలో కోల్పోయింది. వైసిపి ప్రభుత్వం ఈ పథకం గురించి ఆలోచన చేయలేదు. లబ్ధిదారులు మాత్రం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా... అధికారులతో మాట్లాడినా సరైన సమాధానం రాలేదు. ఈ విధంగా మొన్నటి ఎన్నికల నాటికి ఆరేళ్లు గడిచిపోయాయి. 2024లో జరిగిన ఎన్నికల్లో టిడిపి మళ్లీ అధికారంలోకి వచ్చింది. లబ్ధిదారులు మాత్రం ఇంకా ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ పథకానికి అప్పట్లో కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉండి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు కూడా వారిద్దరే అధికారంలో ఉన్నారు. ఈ పథకంపై పునరాలోచించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ గృహాలు ఇవ్వలేమంటే... తాము చెల్లించిన రూ. 25వేలు తిరిగి ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. అసలుతో పాటు వడ్డీ కూడా ఇవ్వాలని, లేని పక్షంలో డబుల్ బెడ్‌రూమ్ గృహం ఇవ్వాల్సిందేనని మరి కొందరు వాదిస్తున్నారు.

## 22న దామచర్ల ఆంజనేయులు వర్ధంతి

**ప్రజాశక్తి-టంగుటూరు**

మాజీ మంత్రి కీర్తిశేషులు దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి ఈ నెల 22న నిర్వహించనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. తూర్పునాయుడుపాలెంలో జరుగనున్న సంస్మరణ సభలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు నూకసాని బాలాజి, తదితరులు హాజరవుతారని దామచర్ల సత్య తెలిపారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చంద్రబాబుకు దామచర్ల సత్య వినతి

**ప్రజాశక్తి-కొండపి**


చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న సత్య

కొండపి నియోజక వర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి దామచర్ల సత్య వినతిపత్రం అంద జేశారు. శుక్రవారం నాగలుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన చంద్రబాబునాయుడుని దామచర్ల సత్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై చంద్రబాబుతో చర్చించినట్లు దామచర్ల సత్య తెలిపారు.

## శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**సిఐటియు మండల కార్యదర్శి బండ్ల నరసింహులు**

**ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్**

గిద్దలూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం గిద్దలూరు తహశీల్దార్ ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బండ్ల నరసింహులు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు గత ఎనిమిది నెలలుగా గౌరవ వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశంపై పలుమార్లు మండల విద్యాశాఖ అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని 8 నెలల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని, వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకురాలు పుష్ప, సమీరా, ఎం.రాధ, మౌలాబి, జహీరాభి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

**ప్రజాశక్తి-టంగుటూరు**


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జయంత్ బాబు

జరుగుమల్లి మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను టంగుటూరు గవర్నమెంటు హైస్కూల్‌లో బెల్లం జయంతిబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మాట్లాడుతూ క్రీడలు శారీరక ధారుడ్యాన్ని, మానసిక వికాసాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత, బెజవాడ వెంకటేశ్వర్లు, మండల టిడిపి అధ్యక్షుడు కామని విజయకుమార్, మక్కెన కోటేశ్వరరావు, టంగుటూరు ఎంఇఒ చెంచు పున్నయ్య, బాలాజి, హెచ్ఎం తులసి ప్రభ, కొండపి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ తుల్లిబిల్లి అశోక్ బాబు, పిడిలు మోహన్, వెంకట్రావు, ఉష, కౌసల్య, జయలక్ష్మి, వెంకట్రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. జయంత్‌బాబు క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

**పుల్లలచెరువు:** స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో భాగంగా మండలంలోని పిడికిటివానిపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో శ్యాముల్ జార్జ్, ఎంఈవో-2 ఇందిరా ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, కోకో, కబడ్డీ, వాలీబాల్, తదితర ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిజెవి ప్రసాద్, హూణే నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కొత్తపట్నం:** కొత్తపట్నం హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడలను ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అవసరమన్నారు. అథ్లెటిక్స్ 100 మీటర్స్, 200, 400, 800 మీటర్స్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. రెండో రోజు ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి అసోసియేషన్ మండల సెక్రెటరీ, కొత్తపట్నం పిడి సాయి కిషోర్, ఫయాజ్, భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-పొన్నలూరు**

మాజీమంత్రి దివంగత దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా 22న తూర్పునాయుడు పాలెంలో జరిగే కార్యక్రమంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. శుక్రవారం పొన్నలూరు టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.


విరాళాలు అందజేస్తున్న దాతలు

## పాఠశాల వజ్రోత్సవానికి విరాళాలు

**ప్రజాశక్తి-తర్లుపాడు**

మండలం కేంద్రమైన తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలకు భారీగా విరాళాల ఇచ్చారు. రేపల్లె గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేసిన పాఠశాల పూర్వ విద్యార్థి పార్లపల్లి సుధాకర్ రావు వారి తండ్రి గాలేయ్య జ్ఞాపకార్థం రూ.20,075, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోసు సుబ్బారావు ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్‌కు అందచేశారు. అదే స్ఫూర్తితో కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రూ.20,075, నాయుడు పల్లె గ్రామస్థుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిప్పిరెడ్డి వెలుగొండా రెడ్డి, విశ్రాంత ప్రధానొపాధ్యాయులు గోసు వెంకట సుబ్బారావులు కలిపి రూ.20,075, స్కూల్ అసిస్టెంట్ పటాన్ రెహమాన్ ఖాన్ రూ.15000, విశ్రాంత విద్యాశాఖ అధికారి ఎన్.సి.కృష్ణారెడ్డి రూ.15,000, పెరుమాళ్ళ బాల మోహన్ రూ.15,075 విరాళాన్ని ప్రధానోపాధ్యాయునికి వజ్రోత్సవ వేడుకల అభివృద్ధి కోసం అందజేశారు. వీరందరికీ ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ అభినందనలు తెలిపారు.

## సాదాసీదాగా మండల సమావేశం

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**


మాట్లాడుతున్న ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. శుక్రవారం ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ అధ్యక్షతన ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు సగానికి పైగా అధధికారులు గైర్హాజరయ్యారు. ఉన్న వారితో నామమాత్రంగానే చర్చించి సమావేశాన్ని ముగించారు. ప్రతిసారి సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించడంపై కొంతమంది ప్రజా ప్రతిధులు అసహనం వ్యక్తం చేశారు. టీ, సమోసాలకే పరిమితమైందని ఆరోపించారు. అధికారులు రాకుంటే ఈ సమావేశం ఎవరికోసం నిర్వహించాలని మండిపడ్డారు. అధికారులు సమావేశానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఏవో ప్రసూనాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణపై తీర్పును పున:పరిశీలించాలి

**మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు**

**ప్రజాశక్తి-శింగరాయకొండ**


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మరోసారి పరిశీలించి రద్దు చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు కోరారు. సెప్టెంబర్ 22న ఒంగోలు అంబేద్కర్ ఓపెన్ ఆడిటోరియంలో జరగనున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా సభను జయప్రదం చేయాలని శుక్రవారం శింగరాయకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర కరపత్రం ఆవిష్కరించారు. శింగరాయకొండ అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు పులగర కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటరావు మాట్డాఉతూ సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పు రాజ్యాంగములోని ఆర్టికల్ 341కు వ్యతిరేకమన్నారు. ఈ తీర్పు దేశ వ్యాప్త కోట్లాది మంది దళితుల మనోభావాలను దెబ్బ తీసిందన్నారు. సెప్టెంబర్ 22న ఒంగోలులో నెల్లూరు బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ ఆడిటోరియంలో సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు, సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుదర్శ శ్యామ్ ప్రసాద్, విద్యార్థి సంఘాలు జెఎసి ఏసీ చైర్మన్ ఉజ్వల అంబేద్కర్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఈనెల 27, 28, 29 తేదీలలో పామూరులో జరిగే జిల్లా సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో అనూహ్యమైన మార్పులు జరిగిన నేపథ్యంలో సైద్ధాంతిక శిక్షణ అవసరం ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, కెవి కష్ణగౌడ్, జి.గురునాధం, బాణాల రామయ్య, ఆవుల యోగయ్య, గుంటూరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరికి ఘన నివాళి



సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

**ప్రజాశక్తి - చీరాల**

పార్లమెంటులో, ప్రజాక్షేత్రంలో దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడటం, కష్ట జీవుల ప్రయోజనాలపై చర్చ పెట్టడంలో సీతారాం ఏచూరి కార్మికులు, కష్టజీవుల ప్రతినిధిగా ఉపాధి హామీ చట్టం వంటి అనేక అంశాలను చర్చకు పెట్టి సాధించారని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకురాలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఒ భవన్లో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు డి విజయభాస్కర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభలో ఘనంగా నివాళులర్పించారు. రమాదేవి మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండే రాజకీయాల లోకి వచ్చారని అన్నారు. దేశంలో అత్యున్నత విద్యా సంస్థ జవహర్లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో చదువుతూ ఎస్ఎఫ్ఐ నేతగా పరిచయమైన ఆయన దేశ రాజకీయా ల్లో, రైతులు, కార్మికులు, కష్టజీవుల ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుగా చివరి వరకు పనిచేశారని అన్నారు. లౌకిక ప్రజాస్వామ్యం కోసం చట్టసభలో ప్రజల వాణిని వినిపించా రని అన్నారు. దేశ ప్రజల ఆస్థులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలపై పార్లమెంటులో ప్రశ్నించా రని అన్నారు. దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు, అంబానీ, అదానీలకు అనుకూలంగా కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించారని అన్నారు. పెరుగు తున్న ఆధునిక సాంకేతికతతో గ్రామీణ ప్రాంతాల్లో తరిగిపోతున్న ఉపాధి అవకాశాలను ముందు గానే పసి గట్టిన సీతారాం ఏచూరి కృషితో యుపిఎ ప్రభుత్వ కాలం లో ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిపాదించి అమలు చేయించారని అన్నారు. ఆ చట్టం నేదు దేశ వ్యాప్తందా లక్షలాది కూలీల జీవితాలకు ఆధారమైందని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి చేస్తున్న ఓట్ల రాజకీయాలను ప్రజలకు విడమర్చి చెప్పడమే కాకుండా పార్లమెంటులో సైతం ఉమ్మడి పౌరసత్వ ప్రతిపాదనను వ్యతిరేకించా రని అన్నారు. జెఎన్యు విద్యార్థి సంఘం నేతగా ఎమర్జెన్సీ తర్వాత కూడా వైస్ ఛాన్సలర్గా కొనసాగు తున్న ఇందిరాగాంధీ రాజీనామాకు ఆమె సమక్షంలోను ప్రతిపాదించిన ప్రజాస్వామ్య వాదని ఏచూరి అన్నారు. కమ్యునిస్టు రాజకీయాల పట్ల ఆకర్షితులైన ఆయన దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్రంలో బిజెపి ఏతర ప్రభుత్వాల ఏర్పాటులో ఆయన చేసిన సమన్వయం ఇండియా కూటమి ఆవిర్భావం జరిగిందని అన్నారు. ఇలా అనేక అంశాల్లో సీతారాం ఏచూరి దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య లౌకిక వాదులకు దిక్సూచీగా నిలిచారని అన్నారు. ఆయన మరణం సిపిఎంతో పాటు దేశ రాజకీ యాలకు, సామాన్య ప్రజలకు తీరని లోటని అన్నారు. సభలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ కార్యదర్శి పి కొండయ్య, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎన్ బాబు రావు, మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి నారపరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్ర రామారావు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు భోగ్యం ఏడుకొండలు, బిసి ఫెడరేషన్ నాయకులు సిహెచ్ మస్తానరావు, ఎస్ఎఫ్ఐ చీరాల నాయకులు సాదిక్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రాథమిక వైద్యులు

## పిహెచ్సి వైద్యుల పెన్డౌన్

**ప్రజాశక్తి - అద్దంకి**

వైద్యారోగ్య శాఖ మంత్రి, కమిషనర్తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనియన్ జరిపిన తొలి విడత చర్చలు సంతృప్తికరంగా లేనందున 23, 24తేదీల్లో మరొకసారి చర్చలు జరపడానికి నిర్ణయించామని వైద్య యువ నాయకుడు తెలిపారు. అప్పటివరకు సమ్మె కొనసాగిస్తూ వైద్యాధికారులు తమ తదుపరి కార్యాచరణను బాపట్ల జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందించారు. చర్చలు సఫలీకృతం అయ్యేవరకూ విధులకు హాజరుకాకుండా తమ నిరసన కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వైద్యశాలల వైద్యాధికారుల సమాఖ్య నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్యాధికారులు సానుకూల నిర్ణయం వచ్చేవరకు పెన్ డౌన్ కొనసాగింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్సి డాక్టర్లు చిట్టిబాబు, మనోజ్, హరికృష్ణ, అనీష్, అక్షిత, వైష్ణవి, గోపినాథ్ పాల్గొన్నారు.

## వెంకయ్య మృతి పట్ల సంతాపం

**ప్రజాశక్తి - ఇంకొల్లు, చినగంజాం**



వడ్లమూడి వెంకయ్య

తెలుగుదేశం చినగంజాం మండలం సీనియర్ నాయకులు, బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకయ్య మృతికి ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకయ్య మృతి బాధాకరమని అన్నారు. ఆయన మరణం తెలుగుదేశంకు, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. మంచి వ్యక్తిని కోల్పోయామన్నారు. తెలుగుదేశం అభివృద్ధిలో కీలక భూమిక పోషించారని గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశంకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. వెంకయ్య కుటుంబానికి తెలుగుదేశం అండగా ఉంటుందని పేర్కొన్నారు.



ఎంఎల్ఎకు వినతి పత్రం అందజేస్తున్న మురళి మోహన్

## సిపిఎస్ రద్దు చేసి.. అక్రమ కేసులు ఎత్తివేయాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

గత ప్రభుత్వంలో సిపిఎస్ వారంలో రద్దు చేస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి పిలుపునిచ్చిన సమయంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ సిపిఎస్ ఉద్యోగులపై అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మండలం వెల్లటూరులో జరిగిన కార్యక్రమంలో శాసన సభ్యులు నక్క అనంతబాబుకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి శాసన సభలో రద్దు చేస్తామని ప్రకటించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అక్రమంగా పెట్టిన కేసులు అన్నిటిని రద్దు చేస్తామని తెలిపారని అన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరామ కృష్ణ, జి గోకర్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**ప్రజాశక్తి - పంగులూరు**

రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దారు నాగరాజరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిందని, వ్యవసాయానికి పెట్టుబడుల కోసం బ్యాంకులు, ఇతర వడ్డీ వ్యాపారుల చుట్టూ రైతులు, కౌలు రైతులు తిరగవలసి వస్తుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల హామీగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలను పెట్టుబడి సహాయం కింద రైతులకు అందజేయాలని కోరారు. రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో పెండింగులో ఉన్న పాస్ పుస్తకాలు, 1బి అడంగల్ రానందువల్ల రైతులు బ్యాంకు రుణాలకు అనర్హులవుతున్నారని చెప్పారు. గత 15, 20ఏళ్ల నుండి వ్యవసాయం తీవ్ర ఒడిదుడుకులతో సాగుతుందని అన్నారు. అతివృష్టి, అనావృష్టి, పకృతి వైపరీత్యాల కారణంగా పంటలు సక్రమంగా పండగ పోవటం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వలన రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సగటున ప్రతి రైతుకు రూ.2.50లక్షల అప్పు ఉందన్నారు. సున్నా వడ్డీలు, పావలా వడ్డీలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే రూ.2లక్షల వరకు అన్ని బ్యాంకుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే జీవో నెంబర్ 22 తక్షణమే రద్దు చేయాలని కోరారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును కొనసాగించాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, అన్ని రైతు సంక్షేమ పథకాల్లో కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నిటికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని, నాగార్జున సాగర్ ప్రాజెక్టు 2వ జోన్లో వరి పంటకు నీరు ఇవ్వాలని కోరారు. కాల్వలు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బాచిన హనుమంతరావు, రావూరి వెంకటేశ్వర్లు, వడ్డవల్లి కోటయ్య, గరికపాటి శంకర్, బాబు, పటాన్ ఖాసీం, వేమూరి సునందబాబు, గుడిపాటి మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు, సంపెంగల వెంకటరావు పాల్గొన్నారు.



డ్రైనేజి పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - చీరాల**

పట్టణంలోని డ్రైనేజిలో వ్యర్థాలను తొలగించేందుకు బిల్డింగ్ పీనలైజేషన్, ల్యాండ్ రెగ్యులేషన్ స్కీంల కింద ప్రభుత్వం ఏక కాలంలో మంజూరు చేసిన రూ.65.10 లక్షలు నిధులతో పనులను ఎంఎల్ఎ కొండయ్య శుక్రవారం ప్రారంభించారు. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రికి ఎంఎల్ఎ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# పాఠశాలకు మైక్సెట్ బహూకరణ



మైక్సెట్ బహుకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

**ప్రజాశక్తి - అద్దంకి**

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు పుట్టినరోజు సందర్భంగా ఆయన సౌజన్యంతో మండలంలోని ధర్మవరం జెడ్పి ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ బహుకరించారు. హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలకు ఎపుడు ఏది అవసరమైతే అది రోటరీ ప్రతినిధులు సమకూరు స్తున్నారని అన్నారు. అందుకు రోటరీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ అధ్యక్షులు వీరయ్య మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా మైక్ సెట్ బహుకరించిన దివాకరదత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. దేవపాలన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి మంచి నడవడికతో బాగా చదువుకుని తల్లి, తండ్రులు, గురువులకు మంచిపేరు తేవాలని పేర్కొన్నారు. మలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు పొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు కష్ట పడి చదవాలని, ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం ఊటుకూరి శ్రీనివాస రావు అధ్యక్షత వహించిన సభలో ఉపాధ్యాయులు చందలూరి నారాయణరావు, కపర్ధి, పార్థసారథి, సుబ్బారావు, లక్ష్మీ మేడం పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ వెంకటకృష్ణ

## వరిలో పోషక లోపాలను నివారించాలి

**ప్రజాశక్తి - అద్దంకి**

వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని కలవకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరిలో జింక్ లోపాన్ని గుర్తించినట్లు తెలిపారు. జింక్ లోపం ఉన్నప్పుడు ఆకులపై తుప్పు రంగులో మారతాయని, మొక్క ఎదుగుదల ఆగిపోతుందని, ఎంత ఎరువులు వేసినప్పటికీ మొక్క తీసుకోలేదని తెలిపారు. దీని నివారణ కొరకు చిలేటెడ్ జింక్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. మేలైన దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తానరావు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రి సభకు హాజరైన జనం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

# మద్దిరాలపాడుకు సిఎం వరాలు

**- పలు సమస్యలు నివేదించిన ఎమ్మెల్యే బిఎన్, సర్పంచి**

**- అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ**

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, నాగులుప్పలపాడు**

వంద రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో సిఎం చంద్రబాబు నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడు గ్రామానికి వచ్చారు. ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా గ్రామసభ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు చదలవాడలోని సాయివిష్ణు విల్లాస్‌లోకి హెలికాప్టర్‌లో దిగారు. అక్కడ నుంచీ సమీపంలోని మద్దిరాలపాడుకు రోడ్డుమార్గంలో వెళ్లారు. ముందుగా గ్రామంలో ఎంపిక చేసిన ముగ్గురు ఇళ్లకు వెళ్లారు. ముందుగా ఖాజావలి అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. అన్ని విషయాలూ వారితో చర్చించారు. కుటుంబ పరిస్థితులు, పిల్లలు, చదువులు, ఉపాధి వంటివి మాట్లాడారు. ఎప్పుడో నిర్మించుకున్న వీరి ఇంటికి గత ప్రభుత్వం బిల్లు ఇవ్వలేదు. రూ.65,100ను గ్రామసభలోనే చెక్కును అందజేశారు. పిల్లల చదువులు ఆగిపోవడంతో వారికి తిరిగి చదువులు కొనసాగేలా చూస్తామన్నారు. తర్వాత కల్లుగీత కార్మికుడు అలుదాసు శ్రీను ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఇద్దరూ కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు పిల్లలనూ ఇంజనీరింగ్ చదివిస్తున్నాడు. ఇతనికి గ్రామంలో ఓ మద్యం దుకాణం ఇవ్వాలని సిఎం ఆదేశాలు ఇచ్చారు. బ్రాందీ షాపుల్లో పది శాతం కల్లుగీత కార్మికులకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తాళ్లూరి జగ్గయ్య అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. వాళ్ల ఇంటిలో పరిస్థితును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇచ్చే పథకాలూ ఆరా తీశారు. ఇక గ్రామ సభలో ముందుగా ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మపై గతంలో మీరు ఇచ్చిన రెండు చెక్‌డ్యాంలు గత ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇప్పుడు వాటిని కొనసాగించేలా చూడాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటిని ఇవ్వాలని కోరారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. చీమకుర్తి ప్రాంతంలో రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. సర్పంచి స్వర్ణ అనురాధ మాట్లాడుతూ తాను టిపిడి నుంచి సర్పంచిగా గెలిచానన్నారు. గ్రామంలో సమస్యలపై అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. కరెంటు తీగలు తెగి జనం మీద పడేలా ఉన్నాయన్నారు. ఇంకా మురుగుకాలువలు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఓవర్‌హెడ్‌ట్యాంకు శిథిలమై జనం మీద పడేలా ఉందన్నారు. శ్మశానవాటిక సమస్య కూడా ఉందన్నారు. వీటన్నింటినీ పరిష్కారం చేస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. సభలు పలువురు మాట్లాడారు. ఓ రైతు మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్లింగ్ యాక్టును రద్దుచేయడం మంచి పరిణామమన్నారు. పింఛన్ పెంపుతో హాయిగా బతుకుతున్నామని ఓ వృద్ధురాలు చెప్పారు. నాలుగు వేలల్లో వెయ్యి రూపాయలు వరద బాధితులకు సాయంగా ఇచ్చామన్నారు. ఇద్దరు వికలాంగులు తమ గోడు చెప్పుకోగా వారికి మోటారు వాహనాలు ఇవ్వాలని సిఎం ఆదేశించారు. డాక్టర్ గీతారాణి మాట్లాడుతూ ల్యాండ్‌టైటిల్లింగ్ యాక్టు ప్రమాదాన్ని వివరించారు. మీ ప్రోత్సాహంతోనే ఉన్నత విధ్యను అభ్యసించి ప్రస్తుతం ఓ కాలేజీని నిర్వహిస్తున్నానని చెప్పారు. ఇక హెలీప్యాడ్ వద్ద మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్



సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న డాక్టర్ గీతారాణి

## పెన్షన్ పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే..

ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికినీ ఇచ్చిన హామీ మేరకు 4 వేల రూపాయలకు పెన్షన్ పెంచిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి.. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు నిర్ధారించి చేపట్టేలా చర్యలు తీసుకున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. విజయవాడలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి 10 రోజుల పాటు వరద బాధితుల మధ్య ఉండి వారికి భోరోసా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నియోజక వర్గంలో గతంలో ముఖ్యమంత్రి గా వున్నా సమయంలో రెండు చెక్ డ్యామ్‌లు మంజూరు చేయగా, ప్రస్తుతం ఆ పనులు నిలిచిపోయాయని, వాటిని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జలజీవన్ మిషన్‌లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ప్రతి ఇంటికి వాటర్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉందని, సిసి రోడ్లు, డ్రైన్స్ నిర్మాణాలు చేపట్టాలని సిఎం దృష్టికి తెచ్చారు. మద్దిరాలపాడు సర్పంచి స్వర్ణ అనురాధ మాట్లాడుతూ మూడు వేల జనాభా ఉన్న గ్రామం లో పారిశుధ్య, తాగునీరు, డ్రైనేజి, కరెంటు స్తంభాలు ఏర్పాటు వంటి సమస్యలు ఉన్నాయని సిఎం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మండవ సుశీల మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం 4 వేల రూపాయలకు పెన్షన్ ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామానికి చెందిన వి. వెంకట శేషయ్య, డాక్టర్ ఎం.గీతారాణి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి.. ప్రజల్లో భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు.

## రూ.124.20 కోట్ల పనులకు శంకుస్థాపన

తొలుత ప్రకాశం జిల్లాలోని గ్రామాలలో అంతర్గత సిమెంట్ రోడ్లు, సిమెంట్ కాలువలు, తారు రోడ్లు, టూరిస్ట్ ప్రాంతాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి 124.20 కోట్లతో చేపట్టనున్న 1144 పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా సిఎం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



ఖాజావలి పఠాన్ బీబీ దంపతులతో మాట్లాడుతున్న సీఎం



సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ.. పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి దామోదర్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్, పారిశ్రామికవేత్త కంది రవిశంకర్



వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

## వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి - పర్చూరు**

స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలో సేద తీరే వృద్ధులు 32 మందికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వెలనాటి వెంకట్ రామ్ జన్మ దినోత్సవ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసిన దాతలకు ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదంలు తెలిపారు. పుట్టినరోజు వేడుకలు వృద్ధుల మధ్య జరుపు కోవటం సంతోషంగా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ అన్నారు. వృద్ధులు అందరూ పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య వంత మైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, నాగబైరు శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, గడ్డిపాటి శ్రీనివాసరావు, మున్నంగి వెంకటసుబ్బయ్య, పోలిశెట్టి చంద్రశేఖరరావు, దూలిపల్ల సత్యనారాయణ, కాస అశోక్ కుమార్, ఆశ్రమ నిర్వహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

**ప్రజాశక్తి - రేపల్లె**



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వై కిషోర్‌బాబు

పట్టణంలో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కమిషనర్ సాంబశివరావుకు పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై కిషోర్ బాబు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు అందజేయా లని అన్నారు. తరచూ మంచినీరు పైపులు లీకులై వృధాగా పోతున్న త్రాగునీటిని అరికట్టాలని అన్నారు. పక్కా డ్రైన్లు నిర్మించాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. పట్నంలో వీధి కుక్కలు, ఆవులను నియంత్రించాలనే సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరుతూ పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్ బాబు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆదర్శ వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్ బాబు, కె వెంకటేశ్వర్లు, సాయి కృష్ణమాచార్యులు, మోహనరావు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

**ప్రజాశక్తి - అద్దంకి**

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు కంపెనీలైన కల్లం టెక్స్‌టైల్స్, కెఎల్ గ్రూప్, మాస్టర్ మైండ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కంపెనీలకు 66 మంది హాజరు కాగా 24మండి ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె సాహిల్ బాబు నిరుద్యోగ యువతీ, యువకులను ఉద్దేశించి పెద్ద ఉద్యోగమైన చిన్న ఉద్యోగంతోనే ప్రారంభం అవుతుందని అన్నారు. ఉద్యోగ అవకాశం దూర ప్రాంతంలో వచ్చిన గాని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కంపెనీ ప్రతినిధులు దూర ప్రాంతం నుండి కళాశాలకు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ జిల్లా ఆఫీసర్ బి శ్రీనివాస్, కళాశాల స్పాక్ పర్సన్ జి రాజ్ కుమార్, రవి కిరణ్, కోర్డినేటర్స్ గోపి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వంద రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం భేష్

### 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆనందబాబు



భట్టిప్రోలులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు



చెరుకుపల్లి మండలం గుల్లపల్లిలో మంచి ప్రభుత్వం

**ప్రజాశక్తి - పర్చూరు**

రాష్టంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా ప్రభుత్వం సాధించిన లక్ష్యాలను ఈనెల 20 నుండి 26వరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయం నందు ప్రజావేదిక నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు 100 రోజుల ప్రగతిని వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలు, స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అందించాలని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని అన్నంభోట్ల వారిపాలెం, ఏదుబాడు గ్రామాల్లో శుక్రవారం ప్రజా వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకర్గ స్పెషల్ ఆఫీసర్ వై రామకృష్ణ, ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్, ఇఒఆర్‌డి ఎ రామకృష్ణ, సర్పంచి నెల్లూరు అనంతమ్మ, ఎం రామారావు పాల్గొన్నారు.

**రేపల్లె :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మండలంలోని బేతపూడి పంచాయతీలో శుక్రవారం నిర్వహించినట్లు ఎంపిడిఒ శివపార్వతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమని ప్రజల చేత అనిపించుకుంటుందని ప్రత్యేక అధికారి పానకాలరావు అన్నారు. అవ్వ, తాతలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6వేలు ఇచ్చినట్లు తెలిపారు. లక్షల మందికి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్, నిరుద్యోగ యువత భవిష్యత్తుపై మెగా డీఎస్సీ, మొదటి సంతకం కష్టాల్లో ఆప్తుడిగా తోడు నిలిచి వరదలపై విజయం సాధించారని సిఎంను అభినందించారు. ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పిస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు జరిగిందని తెలిపారు. రైతు కష్టానికి ప్రతిఫలంగా రూ.1674కోట్లతో ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లిస్తుందని అన్నారు. ఇలా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి, కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివపార్వతి, ఇఒఆర్‌డి మల్లికార్జునరావు, తెలుగుదేశం నాయకులు కె నరసింహారావు, బేతపూడి వీరయ్య, వాక వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కారుమూరు జ్యోతి యేసు రత్నం పాల్గొన్నారు.

**చెరుకుపల్లి :** వంద రోజుల పరిపాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా గుల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సంయుక్త కలెక్టర్‌తోపాటు రేపల్లె ఆర్డిఓ హెలా షారోన్ మాట్లాడారు. 100రోజుల పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు వివరించారు. అంగన్‌వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. అనంతరం గర్భవతులకు సాముహిక శ్రీమంతం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేసి సంక్షేమ పాలన అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మల్లాది రామకృష్ణయ్య, జడ్పిటిసి మత్రివాడ వెంకట పావని, తహాశీల్దారు సిహెచ్ పద్మావతి, ఎంపిటిసి కాటూరి నిర్మల, టిడిపి నాయకులు వంగర శ్రీనివాస చక్రవర్తి, ఎపిఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఈవూరి విజయబాబు పాల్గొన్నారు.

**నగరం :** మండలంలోని బోరమదిగపల్లి, సజ్జవారిపాలెం సచివాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారి బి సైదానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో ప్రజలు మెచ్చిన కార్యక్రమాలును గ్రామల్లో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ మెగా డీఎస్సీతో 16437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. పింఛన్లు ఒకేసారి రూ.వెయ్యి వరకు పెంచి రూ.4వేలకు పెంచి ఒకేరోజు 65.18లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4408 కోట్లు పంపిణీ చేయడం చరిత్రలో తిరుగులేని అంశమని అన్నారు. ప్రతి నెల 1న ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రూ.5లకే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరంలో వరదల్లో అల్లాడుతున్న ప్రజలను ఆదుకునేందుకు 10రోజుల పాటు బస్సులో ఉండి నిద్రాహారాలు మాని చంద్రబాబు ఓ తండ్రి లా ప్రజలను కాపాడారని అన్నారు. ఇక మీదట కూడా ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తునందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారులు తహాశీల్దారు జి నాంచారయ్య, ఎంపిడిఒ వి రమేష్ బాబు, పిఆర్ ఎఇ ఎస్‌కె కరిముల్లా, సర్పంచ్ చందోలు దేవదాసు పాల్గొన్నారు.

**నిజాంపట్నం :** ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా సీఎం చంద్రబాబు సుపరిపాలన సాగిస్తున్నారని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. మండలంలోని బావాజీపాలెంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 100 రోజుల్లో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, అమరావతి - పోలవరానికి నిధులు, 'ల్యాండ్ టైటిలింగ్' రద్దు తదితర ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. ఇటీవల విజయవాడను భారీ వరదలు ముంచెత్తాయనీ వరద సమయంలో ప్రభుత్వం, సీఎం చంద్రబాబు స్పందించిన తీరు ఎంతో గొప్పదని చెప్పుకొవచ్చని అన్నారు. ఒక సామాన్యుడి లాగే సీఎం చంద్రబాబు వరద ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షించారని అన్నారు. వరదల్లో సర్వం కోల్పోయిన వరద బాధితులకు తానున్నాంటూ సీఎం చంద్రబాబు భరోసా కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందారనీ అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ నజీర్ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి, టీడీపీ నాయకులు జిలాని, రబ్బాని, మీరా, గాలి రాజు, వీరయ్య పాల్గొన్నారు.

**భట్టిప్రోలు :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటి ప్రాధ్యానతా క్రమంలో అమలు చేస్తున్నామని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని వెల్లటూరు పంచాయితీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన వంద రోజుల ప్రభుత్వ పాలనను వివరించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గల ఎస్టీ కాలనీ ఇళ్లను సందర్శించారు. గడిచిన వంద రోజుల్లో ప్రజలకు జరిగిన మంచిని తెలియజేస్తూ వాల్ పోస్టర్లను అంటించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్, జడ్పిటిసి తిరువీధుల ఉదయ్ భాస్కరి, జనసేన ఇన్‌ఛార్జి ఉసా రాజేష్, సర్పంచ్ బొజ్జ రవి, ఎంపీటీసీ వాకా నారాయణ పాల్గొన్నారు.

**యద్దనపూడి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలోని జాగార్లమూడి, పడమర పెద్దివారిపాలెం గ్రామాల్లోను ఇంటింటికీ తిరిగి వంద రోజుల్లో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేసిన పనులను వివరించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల్లో పెన్షన్స్, సంక్షేమ పథకాలు, అన్న క్యాంటిన్ పురుద్ధరణ వంటి మంచి పనులు చేపట్టిందని చెప్పారు. ఎంపిడిఒ కృష్ణ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలును ప్రజలలోకి తీసుకు వెళ్ళాలని చెప్పారు. కార్యక్రమంలో తహాశీల్దారు రవి కుమార్, ఇఒఆర్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నగరంలో మాట్లాడుతున్న బి సైదా నాయక్



మాట్లాడుతున్న నిజాంపట్నం మాజీ జెడ్‌పిటిసి సుబ్బయ్య



సమావేశంలో యద్దనపూడి ప్రత్యేక అధికారి మోహనరావు

## న్యాయవాదుల సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - చీరాల**



కొండయ్యకు చెక్కు అందిస్తున్న న్యాయవాదులు

న్యాయ వృత్తితో పాటు సేవ కార్యక్రమంలో ముందుంటున్న న్యాయవాదుల సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. వరద ప్రాంతాల్లో ప్రజలనుఆదుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధికి బార్ అసోసియేషన్ రు.30వేల విలువైన చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, అసోసియేషన్ సభ్యులు ఎంఎల్ఎను సన్మానించారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

**ప్రజాశక్తి - వేటపాలెం**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

విద్యార్థినులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రామన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్ టచ్‌కు గురై మదనపడకుండా ఇంట్లో తల్లి, దండ్రులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ పోలీస్ అంబిక, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దెబ్బతిన్న మోటార్లకు సాయం అందించాలి



ఆనందబాబు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - కొల్లూరు**

వరద నీటిలో మునిగిన మోటార్ల రిపేరుకు సాయం అందించాలని కోరుతూ శాసన సభ్యులు నక్క ఆనందబాబును రైతు సంఘం నాయకులు శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ లంక గ్రామాల్లోని రైతులు ఎక్కువ మంది వ్యవసాయ విద్యుత్ మోటార్లపై ఆధారపడి ఉన్నదని తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నప్పటికి మోటర్లు నీటిలో మునిగి పాడైపోయాని అన్నారు. రేవు ఒడ్డున ఉన్న మోటర్లు కొట్టుకుపోయి నది అంచున ఉన్న భూముల్లో ఇసుక మేటలు వేశాయని అన్నారు. వ్యవసాయ భూములు వరద నీటి కోతకు గురై నదిలో కలిసిపోయాయని తెలిపారు. అందువలన వరద నీటిలో మునిగిన మోటర్ల రిపేరుకు సాయం అందించాలని కోరారు. వరదనీటిలో కొట్టుకుపోయిన మోటార్లకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఇసుక మేటలు తొలగించుటకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలని కోరారు. నది ప్రవాహంలో భూములు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. లంక గ్రామాల్లో శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, కృష్ణా నదిపై ఓలేరు, రావి అనంతవరం దగ్గర చెక్ డ్యామ్ నిర్మించాలని అన్నారు. ఆర్‌సి భూముల్లో సాగుచేసిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బివికె ప్రసాద్, కె రామస్వామి, బి సుబ్బారావు పాల్గొన్నారు.



రైతులకు ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

## ఈకెవైసి నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి - వేమూరు**

ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పంటలకు ఈనెల 23లోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఒ సిహెచ్ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు విజయకుమార్ సూచనలతో శుక్రవారం రైతులకు యుద్ధ ప్రాతిపదికన ఈ క్రాప్ నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇక ప్రభుత్వం నుండి రైతులు, కౌలు రైతులకు అదే ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిఈఓ, విఎఎలు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ ఆర్ విజయబాబు

**రేపల్లె :** రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 23న రైతులు పంట నమోదు చేసుకోవాలని సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్ విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదుకు సంబంధించి ఈనెల 23లోపు పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ఉండే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు వివరాలు ఇచ్చి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు వెంటనే పంటను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. పంట నష్టంతోపాటు పండిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు చేయాలన్న ఈ పంట నమోదు తప్పని సరి అవుతుందని తెలిపారు.

# ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

**ప్రజాశక్తి - చీరాల**

మండలంలోని జాండ్రపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, విద్యార్థులు బాల్యం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**కారంచేడు :** మండలంలో 86వ స్కూల్ గేమ్స్ పోటీలను కుంకలమర్రు ఆర్‌జెఎస్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఇఒ ఎ శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో ప్రాతినిధ్యం ఉండాలని అన్నారు. ఆటల వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసానికి, ఉత్తేజానికి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ప్రవేటు పాఠశాలలో చదివే విద్యార్థులకన్నా ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు క్రీడామైదానం, క్రీడా సామాగ్రి, వ్యాయామ ఉపాధ్యాయులు వంటి సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. వీటిని విద్యార్థులుకు ఉపయోగించుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బహుమతులు సాధించాలని అన్నారు. ఆరోగమే మహా భాగమని, ఆరోగ్యం కోసం క్రీడలు అలవాటు చేసుకోవాలని ఎంఇఒ మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. కుంకలమర్రు పాఠశాల హెచ్ఎం కె పద్మావతి మాట్లాడుతూ కుంకలమర్రు పాఠశాల ఆటలకు అనువైన, సువిశాలమైన క్రీడామైదానాన్ని ఉపయోగించుకొని క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పిఇటి సిహెచ్ సుబ్బారావు, పావులూరి శ్రీనివాసులు, బి రమాదేవి, కె ప్రసాదులు పాల్గొన్నారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలి

**ప్రజాశక్తి - అద్దంకి**

మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న రోజువారి కార్మికుల కాంట్రాక్ట్ పొడిగించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గత మూడేళ్లగా రోజువారి కార్మికులుగా పనిచేస్తున్న 25 మందిని అప్పుడున్న అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో పారిశుధ్య పనుల్లో నియమించారని తెలిపారు. వారికి సంవత్సరం లేదా ఆరు నెలల కాలం పాటు కాంట్రాక్టు పద్ధతి ద్వారా వేతనాలు చెల్లిస్తూ వస్తున్నారు. కార్మికులకు ఇచ్చిన కాంట్రాక్ట్ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్న సందర్భంగా కార్మికులను మరొక సంవత్సరం పొడిగించాలని కోరారు. ఇంజనీర్ విభాగంలో పనిచేస్తున్న 12 మందిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గాలి భీష్మ, పి ఆదం, ఇంజనీర్ వర్కర్స్ సామేలు, జాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

## సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

**ప్రజాశక్తి - చీరాల**

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసి 100 రోజుల పరిపాలనలో 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకుందని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి 100 రోజుల్లోనే ప్రజల చేత మంచి ప్రభుత్వం అనిపించుకుందని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చక్రవర్తి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సేవ చేయడమే వాసవీ క్లబ్ లక్ష్యం

**ప్రజాశక్తి - కర్లపాలెం**

ప్రజలకు సేవ చేయడమే వాసవి క్లబ్ లక్ష్యమని క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో యక్కల జోన్ సోషల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చిన్ననాటి నుండే తల్లి, దండ్రులు పిల్లలకు సేవ చేయడం నేర్పించాలని అన్నారు. వాసవి క్లబ్ మాజీ ప్రెసిడెంట్ తునుగుంట్ల సుబ్బారావు, కె రామకృష్ణ, కోడూరి చంద్ర, తడికమల్ల విజయకుమార్, పానుగంటి సోమశేఖర్, నందిపాటి నాగమల్లేశ్వరావు, రాయవరపు సుబ్బారావు, కొమ్మూరి మురళి, తునుగుంట్ల లలిత బాబు, జివి గుప్తా, భూమా వాసును సన్మానించి జ్ఞాపకలు అందజేశారు. కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ యక్కల శ్వేత, ఆలపాటి అనూష, చేబ్రోలు విజయలక్ష్మి, నాళం అనిత, తునుగుంట్ల రామ్మోహనరావు, బొలిశెట్టి రాంబాబు, యక్కల భారత్, తునుగుంట్ల జగన్ పాల్గొన్నారు.

# గొర్రెల్లో నీలి నాలుక, చిటుక వ్యాధి లక్షణాలు..నివారణ

**ప్రజాశక్తి - అద్దంకి**

మండలంలో అనేక గ్రామాల్లో రైతులు గొర్రెల పెంపకం చేస్తున్నారు. ఒక్కొక్క గ్రామంలో దాదాపు 500 నుండి 1500 జీవాలను రైతులు పోషిస్తున్నారు. వాటి ఆరోగ్య పరిస్థితులను బట్టి పశు వైద్యులను సంప్రదించి ఎలాంటి జబ్బులు రాకుండా ఉంచగలిగితే రైతుకు లాభాలు చేకూరతాయి.

వర్షాకాలంలో గొర్రెలు, మేకలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతుంటాయని పశు వైద్యశాల ఎడి మోహనరావు తెలిపారు. వర్షాల వల్ల ఖాళీగా ఉండే ప్రదేశాల్లో పచ్చికబయళ్ళ ఏర్పడుతున్నాయి. వీటిని తిన్న జీవాలు అనేక వ్యాధుల బారిన పడతాయి. ఈ వ్యాధుల బారినపడ్డ మేకలు, గొర్రెల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అవి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గొర్రెల్లో కనిపించే నీలి నాలుక, చిటుక వ్యాధి లక్షణాలు, నివారించే మార్గం ఆయన వివరించారు.

**నీలి నాలుక వ్యాధి**

వర్షాకాలంలో గొర్రెలకు వచ్చే ప్రధాన వ్యాధుల్లో నీలి నాలుక వ్యాధి ఒకటి. వైరస్ కారణంగా వచ్చే ఈ వ్యాధి ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్ మాసాల్లో అధికంగా వ్యాపిస్తుందని తెలిపారు. నీలి నాలుక వ్యాధి సోకిన గొర్రెలకు ముఖం వాపుతో పాటు పుండ్లు ఏర్పడతాయి. గొర్రె మూతి, పెదవులు, చిగుళ్ళు, నాలుక వాపుతో పాటు



గొర్రెలను మేపుతున్న కాపరి

పుండ్లు ఏర్పడ తాయి. తీవ్రమైన జ్వరం ఉంటుంది. నోటి ద్వారా దుర్వాసన అధికంగా వస్తుంది. వ్యాధి మరింత ముదిరితే నాలుక నీలి రంగులోకి మారుతుంది. ఈ సమయంలో మేత సరిగా తిన లేవు. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే ఈ వ్యాధి సోకిన గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది.

**నీలి నాలుక - నివారణ**

గొర్రెలకు నీలి నాలుక వ్యాధి సోకకుండా ఉండాలంటే వైరస్ వ్యాప్తికి కారణ మయ్యే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. గొర్రెల షెడ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. వ్యాధి సోకిన గొర్రెలను వేరుగా ఉంచడం వల్ల మిగతా వాటికి ఇది వ్యాపించకుండా ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే పశువుల డాక్టరుకు చూపించి వారి సూచనలు పాటించాలి.

**చిటుక వ్యాధి**

గొర్రెలకు సోకే ప్రమాదకరమైన వ్యాధుల్లో 'చిటుక వ్యాధి' ఒకటి. ఈ వ్యాధికి గురైన గొర్రెలు, చిటుక వేసినంత సమయంలోనే మృత్యువాత పడతాయి. అందుకే దీన్ని 'చిటుక వ్యాధి' అని పిలుస్తారు. ఇది 'క్లాస్ట్రీడియం పర్ఫింజన్స్ టైప్-డి' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తేమతో కూడిన పచ్చగడ్డిని గొర్రెలు తిన్నప్పుడు చిటుకు వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**లక్షణాలు, నివారణ చర్యలు**

సాధారణంగా ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో ఎలాంటి లక్షణాలు బయటికి కనిపించవు. ఎక్కువ సంఖ్యలో లక్షణాలు లేకుండానే చనిపోతాయి. కొన్ని సార్లు చిటుక వ్యాధికి గురైన గొర్రె పిల్లలు చెంగున గాలిలోకి ఎగిరి, హఠాత్తుగా మరణిస్తాయి. పెద్ద గొర్రెలు తీవ్రమైన అనారోగ్యంతో సరిగ్గా నడవలేకపోతాయి. మేత తినవు. నోటి నుంచి చొంగ కారుస్తూ, పళ్ళ కొరుకుతూ బిగుసుకొని చనిపోతాయి. వ్యాధి తీవ్రత ఎక్కువైనప్పుడు జీవాల్లో విపరీతమైన జ్వరం కనిపిస్తుంది. మేత మేయకుండా నీరసపడతాయి. ఈ వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించి వారి సలహాలను పాటించాలి. పశువైద్య అధికారులు సూచనలు పాటించాలని చెప్పారు.

బహిరంగ ప్రదేశాలలో

# మద్యం సేవించే వారిపై చర్యలు

**- 81 మందిపై కేసులు నమోదు - ఎస్పీ తుషార్‌డూడీ**

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాలతో గురువారం రాత్రి జిల్లా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినచర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలు ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు, శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్నారు. అందువల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గత రాత్రి నిర్వహించిన "స్పెషల్ డ్రైవ్" లో మొత్తం 81 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరిని సంబంధిత న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇకపై కూడా ఈ విధానాన్ని కఠినంగా అమలు చేస్తామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్లు, హెూటల్లు ఇతర అనుమతి లేని ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. వాటి నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది వారి పరిధిలోనే బహిరంగ ప్రదేశాలపై నిఘా ఉంచాలన్నారు. ఆ ప్రదేశాలలో గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తూ ఉండాలన్నారు. విజిబుల్ పోలింగ్, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించే సమయాలలో ప్రజలతో మమేకమై ఆ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం తెలుసుకోవాలన్నారు. తద్వారా ఆ ప్రదేశాల పై నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయవచ్చున్నారు. జిల్లా ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు గురించిన సమాచారం తెలిస్తే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

# పంచాయతీల బలోపేతంతోనే రాష్ట్రాభివృద్ధి

**ప్రజాశక్తి-సంతమాగులూరు, బాపట్ల జిల్లా**

పంచాయతీలు బలంగా ఉంటేనే గ్రామాలు, జిల్లా, రాష్ట్రం అభివద్ధి చెందుతాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా శుక్రవారం జరిగాయి. సంతమాగులూరు మండలం, మిన్నేకల్లు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె.వెంకటమురళి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రాల ద్వారా కొందరు తమ సమస్యలను విన్నవించగా, మరి కొందరు తమ ఇబ్బందులను తొలగించాలని అభ్యర్థించడంతో తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళి గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివద్ధికి బాటలు వేస్తోందని రాష్ట్ర మంత్రి రవికుమార్ చెప్పారు. వరద విపత్తు సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి 10 రోజులు బస్సులోనే ఉండి

**మంత్రి గొట్టిపాటి రవికుమార్**



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజలకు సహాయక చర్యలు అందేలా చూశారన్నారు. విపత్తు ప్రభావాన్ని తగ్గిస్తూ సహాయక చర్యలు అందించడంలో కతార్థులయ్యారన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా ఇస్తామన్నారు. మిన్నేకళ్ళు గ్రామానికి రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలో ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. సంకల్పం, చిత్తశుద్ధితో అతి తక్కువ కాలంలోనే అనేక విజయాలు సాధిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేయడం పింఛన్లను ప్రభుత్వం సమర్ధంగా పంపిణీ చేసిందన్నారు. బాపట్ల జిల్లాలో 30 వేల మంది నిరాశ్రయులైతే సహాయక చర్యలు అందించడంలో వెనుకాడలేదన్నారు. అద్దంకి నియోజకవర్గ ప్రజల కొరకు ప్రతి సోమవారం ఒక మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వుకుంటే ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పథకం కింద రూ.15 వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేషంగా కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ఎండిఓ లక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, ఎంపీపీ యలమంద, తహసిల్దార్ కె.రవిబాబు, ఎంపీడీవో జి.లక్ష్మీదేవి, నాయకులు చేవూరి వాసు రెడ్డి, తేలప్రోలు రమేష్, ధూపాటి ఏసోబు, మాదాల సుబ్బారావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, సర్పంచ్ ఎం గోవిందమ్మ, అట్లా పెద్ద వెంకటరెడ్డి, డి.గాలెయ్య, కొనికి శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొక్కలు మానవజాతికి ప్రాణవాయువులు: కమిషనర్

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

మొక్కలు మానవజాతి మనుగడకు ప్రాణవాయువులని నగరపాలక సంస్థ కమిషనర్ కె వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక రిమ్స్ వైద్యశాల వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణం రోజురోజుకు కలుషితం అవుతోందని,





మొక్కలు నాటుతున్న కమిషనర్, రిమ్స్ ప్రిన్సిపల్

కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు పెంచడమే మార్గమని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించేందుకు కూడా చొరవ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు ఆక్సిజన్‌ను, ఆహ్లాదాన్ని పంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు, రిమ్స్ డిప్యూటి సూపరిండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, డిఈఈలు పద్మజా, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు అడ్డాగా 'శింగరాయకొండ రన్‌వే'

**- వందల సంఖ్యకు చేరిన ప్రమాదాలు**

**- రన్‌వే విషయంలో చేతులెత్తేసిన అధికారులు**

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ జాతీయ రహదారి మీద కనుమళ్ల నుంచి కలికివాయి మధ్య అత్యవసరం ఇంకా విమానం దిగేందుకు రన్‌వేని కేంద్ర ప్రభుత్వం 2019లో మంజూరు చేసింది. దీనికి రూ.52 కోట్లా 87 లక్షలతో కనుమళ్ల నుంచి కలికివాయి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ రన్‌వే నిర్మాణం చేపట్టింది. అయితే విమానాల సంగతి పక్కనపెడితే ప్రస్తుతం ప్రమాదాలకు అడ్డాగా ఈ రన్‌వే మారిపోయింది. ప్రతిరోజూ ఏదో ఒక ప్రమాదంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కనుమళ్ల-కలికివాయి మధ్య జాతీయ రహదారిపై రన్‌వే ప్రాంతంలో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఆ సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత ఎలాంటి హెచ్చరిక బోర్డు లేనందువల్ల మధ్యలో డివైడర్ సైతం లేకపోవడంతో వాహనదారులు అక్కడికి రాగానే వేగం పెంచేస్తున్నారు. రాత్రుల సమయంలో ఏ వాహనం ఎటు వస్తుందో అర్థం కాని పరిస్థితిల్లో ప్రమాదాలు వందల సంఖ్యకు చేరాయి. గతంలో జిల్లా ఎస్పీగా ఉన్న మల్లికాగర్గ్ రన్వే ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, గతంలో పరిశీలించి ఈ ప్రమాదాల నివారణకు స్టాప్ పెట్టాలని ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఆ విషయం మరిచిపోయారు. 2019 నుంచి ఇప్పటివరకు లెక్కలు తీస్తే ప్రమాదాల సంఖ్య వందల సంఖ్యలోనే ఉంది. మరణాలు అంతంతమాత్రంగా ఉన్నా గాయాల సంఖ్య అధికంగానే ఉంది. ఒక్క సంవత్సరంలోనే 25 పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిల్లో మరణాల సంఖ్య అధికంగానే ఉంది. రాత్రుల సమయంలో ఈ ప్రమాదాలు వాహనాలు వేగంతో



నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)



రోడ్డుప్రమాదంలో చిన్నారి ప్రాణాన్ని కోల్పోయి రోదిస్తున్న తల్లి (ఫైల్)

రావటం వల్ల జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు ఎటు పోవాలో అర్థం కాక లైట్లు దెబ్బకు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలు ఎక్కువగా ఉన్నాయి. రన్వే ఉన్న ప్రాంతంలో లైట్లు లేకపోవడం ఒకటైతే రోడ్డు మధ్యలో బండలు పెట్టి.. హైవే అధికారులు, రన్‌వే అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ బండలు ఉండడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. కార్లు, ఆటోలు, బస్సులు వేగంగా వస్తూ.. ఆ బండను ఢీకొని బోల్తాకొట్టిన ఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం శింగరాయకొండ జాతీయ రహదారి మీద ఉన్న ఈ రన్‌వే ప్రమాదాలకు వడ్డాగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం చీమకుర్తి నుంచి వందల సంఖ్యలో గ్రానైట్ లారీలు రాత్రులు సమయంలో ఎదురెదురుగా ఢీకొనడం బోల్తా పట్టడం లాంటి సంఘటనలు ఇక్కడ ఎక్కువగా జరిగాయి. ఆ గ్రానైట్ రాళ్ళ రోడ్డుపై పడి వాటి వల్ల మరో ప్రమాదాలు కూడా జరిగిన సంఘటనలూ ఇక్కడ ఎక్కువగానే ఉన్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న ఆ బండను తప్పించబోయి ఆర్టీసీ బస్సులు, కార్లు మరో వాహనాన్ని ఢీకొట్టి పక్కకు పోయిన సంఘటనలు కూడా జరిగాయి. అక్కడ వేగ నియంత్రణ లేకపోవడం వల్ల వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని చిన్నారుల ప్రాణాలు సైతం గాలిలో కలిసిన ఘటనలు కూడా ఇక్కడ జరిగాయి. కేవలం ఇక్కడ హెచ్చరిక బోర్డు లేకపోవడం ప్రధానమైన కారణంగా చెప్పుకోవచ్చు. ఆటోలు బోల్తాపడటం, ఆటోలు ఢీకొనటం.. రోడ్డుపైనే గాయాలపాలవడం.. 108 కోసం ఎదురుచూడటం లాంటి సంఘటనలు ఇక్కడ అధికంగానే ఉన్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ రన్‌వే అధికారులు నిద్రమత్తులో ఉంటున్నారు. రన్‌వే ఏర్పాటు చేసే సమయంలో ఇక్కడ విమానాలు దిగుతాయని స్థానికులు ఎంతో ఆశపడ్డారు. కానీ ప్రస్తుతం ఆ రోడ్డు ప్రమాదాలు చూసి ఇక్కడ ప్రమాదాలకు అడ్డాగా మారిపోయిందని చెప్పుకుంటున్నారు. 52 కోట్ల 87 లక్షల రూపాయలు నిధులతో ఇక్కడ సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టి వాటిలో నాణ్యత లేకపోవడం వల్ల రన్‌వే ఆగిపోయిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రమాదాలు రన్‌వేపై ఎందుకు ఎక్కువగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు ఇటీవల కాలంలోనే ఎస్పీ ఏఆర్ దామోదర్ రన్‌వేని పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన ఘటనలన్నీ అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలకు కారణం కేవలం జాతీయ రహదారి అధికారులు, రన్‌వే అధికారులేనని వారిపైన కేసు నమోదు చేయాలని శింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్యకూ ఆదేశాలు జారీ చేశారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాత్రం పార్లమెంటులోనూ పలు సార్లు రన్‌వేపై విమానాలు దింపాలని కోరుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయం పట్టించుకోలేదు. రూ.52 కోట్లా 87 లక్షల రూపాయలతో ప్రస్తుతం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిస్థాయిలో చేయకుండా వదిలేసి వెళ్లిపోయిన కాంట్రాక్టర్‌కు కేంద్ర ప్రభుత్వం అండగా ఉందనే ప్రచారం సాగుతోంది.



రన్‌వేను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్ (ఫైల్)